క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



పామర్రు: మృతుని కుటుంబాన్ని అందరూ సహృదయంతో ఆదుకోవాలని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక 8వ వార్డు నాగులేరుకట్ట మీద ఉన్న నల్లబోతుల తిరుపతయ్య మరియమ్మ దంపతుల కుమారుడు యోధ (13) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ మృతి చెందారు. ఈ నేపథ్యంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు మృతుని కుటుంబానికి స్థానిక వార్డు మెంబరు ఆరేపల్లి శ్రీహరి రూ.5 వేలను ఎంపీపీ చేతుల మీదుగా అందజేశారు. వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, స్థానిక ఎంపీటీసీ భోగిన వెంకటేశ్వరమ్మ, మండల కో ఆప్షన్‌సభ్యుడు ఎండీ హస్మతుల్లా, వలంటీర్లు కోటి, రమేష్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచి మృతి



కురుమద్దాలి(పామర్రు): మండల పరిధిలోని కురుమద్దాలి గ్రామ మాజీ సర్పంచి గుళ్లపల్లి నరసింహారావు (96) బుధవారం మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. గ్రామ సర్పంచిగా 18 ఏళ్ల తమ సేవలను అందించి గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. 1968 నుంచి 1976 వరకు మరలా 1978 నుంచి 88 వరకు సర్పంచ్‌గా విధులు నిర్వహించారు. గ్రామంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించారు. సీపీఎం పార్టీ అనుబంధ రైతు సంఘ నేతగా అనేక రైతు ఉద్యమాలలో పాల్గొని రైతుల పక్షాన పోరాడిన ప్రజా నాయకుడని పలువురు నివాళులర్పించారు. కుల మత రాజకీయాలకు అతీతంగా అందరూ తన శ్రద్ధాంజలి ఘటించారు.

వైఎస్సార్ సీపీ బస్సు యాత్రకు మద్దతు



ముదినేపల్లి రూరల్: ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బస్సుయాత్రకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సేవా నాగ జగన్‌బాబూరావు, మాదిగ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసుపోగు దానియేలు తెలిపారు. స్థానిక దళిత సంఘాల కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి జగనన్న మరోసారి రాష్ట్ర అధికారం చేపట్టాలన్నదే తమ ధ్యేయమన్నారు. సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర విభాగం అధ్యక్షుడు జక్కుల విజయకుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు చీలి లావణ్య, ప్రతాప్‌కుమార్, రాజేష్, షేక్ గౌస్, మహిత, నాగరాజు, ప్రసాదరావు, ఫణి, వరదానం పాల్గొన్నారు.

చౌటుపల్లి చిరంజీవికి డాక్టరేట్



తోట్లవల్లూరు: మైక్రో బయాలజీ విభాగ పరిశోధకుడు చౌటపల్లి చిరంజీవికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. మండలంలోని గరికపర్రుకు చెందిన ఆయన బుధవారం వివరాలను తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బోటనీ అండ్ మైక్రో బయాలజీ విభాగ పరిశోధనా పర్యవేక్షకురాలు ఆచార్య ఎం.విజయలక్ష్మి పర్యవేక్షణలో యాక్టినో బాక్టీరియా ఉపయోగాలపై లోతైన పరిశోధన చేసి గ్రంథం సమర్పించినందుకుగాను యూనివర్సిటీ డాక్టరేట్ ఇచ్చినట్టు చిరంజీవి చెప్పారు.

శ్రీమహాలక్ష్మీ నమోస్తుతే..



తటివర్రు రోడ్‌లో శ్రీధనలక్ష్మీ దేవిగా అమ్మవారి దర్శనం



శంకర మందిరంలో శ్రీవైష్ణవీదేవిగా అమ్మవారు



కోరుకొల్లులో అన్నపూర్ణా దేవిగా పార్వతీ మాత



పమిడిముక్కలలో శ్రీ మహాలక్ష్మీదేవి అలంకరణ



గురజ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీగజలక్ష్మీ దేవిగా..



బుచ్చమ్మ ఆశ్రమంలో ధనలక్ష్మి అలంకారంలో పర్వత వర్ధనీ దేవి

గుడివాడరూరల్: తటివర్రురోడ్‌లో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో అమ్మవారు శ్రీధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు బేతంశెట్టి వెంకటరవికుమార్, ఈశ్వర్‌కుమార్, చంటి, నాగేశ్వరరావు అమ్మవారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. చిన ఎరుకపాడులో శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీసంతానలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ట్రస్టీ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తోట్లవల్లూరు: భద్రిరాజుపాలెంలోని శ్రీరాజశ్యామలాంబదేవి శక్తి పీఠంలో అమ్మవారు కల్యాణ శ్యామలాదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కుందుర్తి సత్యన్నారాయణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్త కళ్లం సుధాకరరెడ్డి పూజా కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

గుడివాడ టౌన్: స్థానిక శ్రీ శంకర మందిరంలో వైష్ణవీ దేవిగా, గౌరీశంకరస్వామి దేవస్థానంలో గాయత్రీ దేవిగా, నీలామహల్‌రోడ్‌లోని విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో గాయత్రీ దేవిగా, భీమేశ్వరస్వామి దేవస్థానంలో (పెద్దశివాలయం) గజలక్ష్మీదేవిగా, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాశీఅన్నపూర్ణా దేవిగా, వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ విజయలక్ష్మీదేవిగా, పిన్నమనేని నగర్‌లోని శ్రీ నాగదుర్గాదేవి అమ్మవారి దేవస్థానంలో మహాలక్ష్మీదేవిగా అమ్మవార్లను అలంకరించి భక్తులకు దర్శనానికి ఉంచారు.



లోకుమూడి దత్తాశ్రమంలో కోలాటం చేస్తున్న మహిళలు

కలిదిండి: కోరుకొల్లు సోమేశ్వర స్వామి ఆలయంలోని పార్వతీమాతను కాశీ అన్నపూర్ణా దేవిగా అలంకరించారు. గొడవర్తి వెంకటేశ్వరరావు, పూర్ణమ విజయలక్ష్మీ దంపతులు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.దేవదాయ శాఖ ఉన్నత ప్రధాన కార్యాలయ స్థపతి పరమేశ్వరప్ప కలిదిండి పాతాళ భోగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనుల ప్లాన్లను పరిశీలించారు.దర్మకర్తలుచిత్తూరు బుజ్జి, చెరుకు వాడబలరామరాజు, తాడినాడ చిన్నబ్బాయి రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ నీలపాల వెంకటేశ్వరరావు, కోపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఓడీపీ రామారావు, అర్చకులు పాల్గొన్నారు.



కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తుల పూజలు



కాశీ అన్నపూర్ణాదేవిగా కొండలమ్మ

పామర్రు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో సంతాలక్ష్మీగా అలంకరించి పూజలుచేశారు. బుచ్చమ్మ ఆశ్రమంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలోని పర్వత వర్ధనీ దేవికి ధనలక్ష్మీగా అలంకరించి పూజలు చేశారు. సోమేశ్వరస్వామిఆలయంలోనిపార్వతీ దేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజించారు. అంకమ్మతల్లి ఆలయంలో గాయత్రీ మాతగా అలంకరించారు.

ముదినేపల్లి రూరల్:గురజ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని గజలక్ష్మీ దేవిగా అలంకరించారు. సింగరాయపాలెం శ్రీఅమృతేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణా దేవిగా అలంకరించి చింతగుంట నాగరాజు, నాగలక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు. ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేటితో ఈకేవైసీ గడువు పూర్తి



పామర్రు: ప్రభుత్వం రైతులు ఈకేవైస్ చేయించుకునేందుకు గురువారం ఒక్కరోజే అవకాశం ఉందని పామర్రు మండల వ్యవసాయ అధికారి శివ నాగరాణి అన్నారు. స్థానికంగా జరుగుతున్న ఈకెవైసీ కార్యక్రమాన్ని ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్–2023 పంటలకు ఈ క్రాప్ నమోదు చేస్తారన్నారు. రైతులు అందరూ రైతు భరోసా కేంద్రాల వద్ద తప్పనిసరిగా తాము వేసిన వరి, పెసర, మినుము, చెరుకు, పత్తి, మొక్కజొన్న, మిర్చి, కందులు తదితర పంటల వివరాలను నమోదుతో పాటు ఈ క్రాప్ నందు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ నమోదు అయిన వారి పంటలను మాత్రమే పంట కొనుగోలు, బీమా వర్తింపు, నష్ట పరిహారం తదితరాలు అందుతాయని తెలిపారు.

పేదల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కలిదిండి: పేదల ఆరోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం పోతుమర్రు ఎంపీపీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్యం

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కైకలూరు ఎంపీపీ స్కూల్‌లో బుధవారం జరిగింది. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో వైద్యుల నియామకం, నూతన ఆస్పత్రులు ఏర్పాటు గతంలో ఏ ప్రభుత్వంలో ఈ స్థాయిలో జరగలేదన్నారు. పేద విద్యార్థులకు తక్కువ ఖర్చుతో డాక్టర్ పట్టా పుచ్చుకునే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. సేవలు అందించిన వైద్యులను సన్మానించారు. ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, జెడ్పీటీసీ కురేళ్ళ బేబీ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ప్రత్యేకాధికారి, ఏలూరు జిల్లా డీఎల్‌పీవో చంద్రశేఖర్, తహసీల్దారు బి.మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి శివన్నారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.లావణ్య, వైద్యులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం అని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెయ్యేరులో ఈ కార్యక్రమానికి సంబంధించి బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. పేదల ఆరోగ్య సంరక్షణకు స్థానికంగానే వైద్య సేవలందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఎంపీడీవో పి.మల్లీశ్వరీ, సర్పంచ్ అల్లు సుశీల, ఎంపీటీసీ కోటే ప్రవీణ్, సొసైటీ అధ్యక్షుడు సోమా సత్యనారాయణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మోట్రు ఏసుబాబు, బేతపూడి వెంకటరమణ, జాస్తీ చంటి, అల్లాభక్షు, కోమటి విష్ణువర్ధన్, సాక్షి సాయిబాబు, దివి సతీష్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి: ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ వైద్యం అందించాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రూపొందించారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని ఉనికిలి గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామ ఆరోగ్య కేంద్రంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన, అట్టడుగు వర్గాల ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, వారి ఆరోగ్య రక్షణకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తుండడం అభినందనీయమని ఎమ్మెల్యే డీఎన్నార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అగస్తీ ఆదివిష్ణు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు బేతపూడి యేసోబు రాజు, సర్పంచ్ ఇమ్మడి అన్నమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన వరప్రసాద్, నిమ్మగడ్డ నారాయణ, మెండా సురేష్, ఇమ్మడి మరియన్న, వల్లూరి వెంకటరత్నం, కొరపాటి దేవేంద్రుడు, కారే ఏసురత్నం, కె.అదృష్టరావు, బి.కాంతారావు, సుధాకర్, వి.మహేష్, పి మహేష్, ఎస్ ప్రకాష్, కె.వెంకటరత్నం, ఎం.అమృతరావు, కె. ధర్మారావు, రాజకుమార్, ఎంపీడీఓ సీకే వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో వైద్యురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

పమిడిముక్కల: మంటాడ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని బుధవారం సర్పంచ్ నందమూడి వీరమ్మ ప్రారంభించారు. వైద్య శిబిరంలో 600 మంది రోగులకు వైద్యులు బాలాజీ, మమత పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విఠల్‌పాల్, ఎంపీటీసీలు మేరుగ లక్ష్మి, మేరుగ రాజేశ్వరి, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, మండల సచివాలయాల కన్వీనర్ పరసా జగన్, పార్టీ నాయకులు కోడెబోయిన కోటేశ్వరరావు,దారపు రమాదేవి, ధూళిపూడి వీర కోటేశ్వరరావు, ఇర్లపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, డోకిపర్రు ఎస్‌వీవీజీఆర్ హైస్కూల్ ఆవరణలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను గుడివాడ ఆర్డీఓ పి.పద్మావతి బుధవారం సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలందరికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇంత గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రెండు వైద్యశిబిరాల్లో 657 మందికివైద్యపరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరాన్ని ఆమె పరిశీలించారు. తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తాన్, డెప్యూటీ తహసీల్దార్ కనకదుర్గ, ఎంపీపీ కొడాలి సురేష్, ఎంపీటీసీ మేరుగు నాగేంద్రరావు, డోకిపర్రు సర్పంచ్ జి.జ్యోతి, వైద్యులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: స్థానిక నీలామహల్ రోడ్‌లోని అల్లంబడి మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో 35వ వార్డు సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ ఇంటి ముంగిటకే ఆరోగ్య సేవలు అందించాలనేది ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశం అన్నారు. పురుషులు 289 మందికి, స్త్రీలు 377 మందికి మొత్తం 666 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్యం కొరకు 10 మందిని విజయవాడకు సిపారసు చేసినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంవీ నారాయణరెడ్డి, ఎం.చిననారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలు రెచ్చగొడుతున్న టీడీపీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

పామర్రు: గ్రామాల్లో విద్వేషాలు సృష్టించేందుకు టీడీపీ నేతలు రెచ్చగొడుతున్నారని, దీనిని సహించేది లేదని పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ మనుగడ కాపాడుకోవడం కోసం ఇటువంటి దుష్ట ప్రచారాలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తోందన్నారు. ప్రజల మౌనాన్ని చేతగాని తనంగా భావిస్తే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రజలు పడిన కష్టాలు మర్చి పోలేదని, ప్రస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నాలుగున్న ఏళ్లగా పొందిన సంక్షేమ పథకాల లబ్ధికి ప్రజలు జగన్‌ను తమ గుండెలలో దాచుకుంటున్నారని గుర్తు చేశారు. రానున్నకాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి చేసేందుకు ప్రజలు అందరూ సిద్ధంగా ఉన్నారని అన్నారు.

రేపు సదస్సు..

ఈనెల 20వ తేదీన స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో నియోజకవర్గంలోని గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర నాయకులు అయోధ్య రామిరెడ్డి హాజరై దిశా నిర్దేశం చేస్తారని తెలిపారు.

నవంబర్ 9న బస్సు యాత్ర ప్రారంభం..

నవంబరు నెల 9వ తేదీన బస్సు యాత్రను ప్రారంభిస్తున్నామని చెప్పారు. ఈ యాత్రలో పలు సంక్షేమ కార్యక్రమాలపై వివరిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీకి సంబంధించిన వర్గాల వారు ఈ యాత్రకు ప్రాతినిధ్యం వహిస్తారని అన్నారు. నియోజకవర్గంలోని ఒక సచివాలయ పరిధిలో బస్సు యాత్ర నిర్వహించి అనంతరం బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలో రెండవ బస్సు యాత్ర పామర్రులో జరుగుతుందన్నారు. ఎంపీపీలు గోగం సురేష్, కుందేటి ఇందిర, జెడ్పీటీసీలు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, రాజుల పాటి పార్వతి, మండల పార్టీ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, కళ్లం వెంకటేశ్వరరెడ్డి, యలమంచిలి గణేష్, రాజుల పాటి రాఘవరావు, గోళ్ల సోమేశ్వరరావు, ఐదు సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి, నడకుదురిరాజేంద్ర, పరసా జగన్, ఆంజనేయులు, గాజుల చిన్నారి, గృహసారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

పామర్రు ప్రాజెక్టు సీడీపీవో భానుశ్రీ

పెదమద్దాలి(పామర్రు): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఇటువంటివి నిర్వహించిన వారిపై తగు విధంగా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పామర్రు ప్రాజెక్టు సీడీపీవో వి.భానుశ్రీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెదమద్దాలి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలను అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల అక్రమ రవాణా, లింగ వివక్ష, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై మాట్లాడారు. ఈ అంశాలపై చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. వీరు గ్రామాల్లో ఉన్న కిశోర బాలికలకు నిరంతరం అవగాహన కల్పిస్తారని తెలిపారు. 18 ఏళ్లు నిండని బాలికలకు ఎక్కడైనా వివాహాలు చేస్తే ఆ సమాచారాన్ని దగ్గరలో ఉన్న అంగన్‌వాడీ సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బందెల జెస్సీ శాంతకుమారి, కార్యదర్శి ఆర్.వెంకట కృష్ణ, జీఎంఎస్‌కే ఎస్.మమత, సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి, వీఆర్వో ఎల్‌మీనా కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

లేగ దూడల అందాల ప్రదర్శన

పెదపారుపూడి: జిల్లా కృష్ణామిల్క్ యూనియన్–జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా బుధవారం లేగ దూడల అందాల పోటీలను పెదపారుపూడిలో నిర్వహించారు. ఈ అందాల పదర్శను విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దున్న దూడలను కూడా పెయ్యల దూడల మాదిరిగా పెంచితే 3 సంవత్సరాల తరువాత రూ.80 వేలకు అమ్ముకోవచ్చన్నారు. ప్రస్తుతం దున్నలకు మార్కెట్‌లో మంచి రేటు వస్తుందన్నారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి కురువా శ్రీనివాసులు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఇప్పటి వరకు 31 లేగ దూడల అందాల పదర్శన నిర్వహించామన్నారు.

బహుమతుల అందజేత.....

అందాల పోటీలో మొత్తం 32 లేగ దూడలు అందాల పదర్శకు వచ్చాయి. పెదపారుపూడి గ్రామానికి చెందిన జాజుల నాగరాజు, భూషణగుళ్ళ గ్రామానికి చెందిన ఆల రమేష్, యలమర్రుకు చెందిన వల్లభనేని భానుప్రకాష్ దూడలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కృష్ణా మిల్క్ యూనియన్ ట్రస్టు సభ్యులు పుణుకొల్లు రత్న ప్రసాద్ (నాని), యలమర్రు పశువర్ధక శాఖ ఏడీ గోలి వెంకట నరసింహారావు, స్థానిక పశువైద్యులు జయంత్, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కైలేపై అసత్య ఆరోపణలు మానుకోవాలి

పమిడిముక్కల: కుల, మత, పార్టీలకతీతంగా నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలని టీడీపీ ఇన్‌ఛార్జ్ వర్ల కుమార్ రాజాకు మద్రివాడ వైఎస్సార్ సీపీ నాయకులు సూచించారు. మద్రివాడలో బుధవారం వారు మాట్లాడారు. మద్రివాడ గ్రామంలో పర్యటించిన కుమార్ రాజా ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రోడ్డు గురించి అడిగిన దళిత యువకుడిని పోలీసులు నిర్బంధించి స్టేషన్ల చుట్టూ తిప్పారనడం అవాస్తవమన్నారు. నిజాలు తెలుసుకొని మాట్లాడాలని, ఎక్కడ ఏది జరిగినా దాన్ని ఎమ్మెల్యేకు ఆపాదించి మాట్లాడటం మానుకోవాలన్నారు. 6వ వార్డులో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపారని, ఈవార్డుపై వివక్ష చూపలేదన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గోపువానిపాలెం నుంచి మద్రివాడ వరకు రూ.3 కోట్లతో ప్రధాన రహదారి నిర్మించడం జరిగిందన్నారు. రూ.40 లక్షలతో సచివాలయ భవనం, రూ.45 లక్షలతో అంతర్గత రోడ్లు నిర్మించారన్నారు. టీడీపీ హయాంలో అధ్వానంగా మారిన ప్రధాన రహదారిని ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. గ్రామంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, వాస్తవాలు తెలుసుకోకుండా ఎమ్మెల్యేను నిందిస్తే సహించేది లేదన్నారు. ఎంపీటీసీ ఊబమల్లేశ్వరి, ఉపసర్పంచ్ డొక్కు నాగకుమార్, సచివాలయ కన్వీనర్‌లు కొలుసు నాగరాజు, రాజులపాటి వెంకటేశ్వరావు, వంపుగడవల పండమ్మ, ఈదా కోటయ్య పాల్గొన్నారు.